ప్రజాశక్తి

సోమవారం 24 జూన్ 2024 పేజీలు 8



విజయనగరం



పార్వతీపురం మన్యం

సంక్షోభ వసతి గృహాలు

- అద్దె భవనాల్లోనే అధిక హాస్టళ్లు
- ఇరుకు గదుల్లో విద్యార్థుల పాట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వెనుకబడిన కులాల విద్యార్థులు చదువుకునేందుకు ఏర్పాటు చేసిన వసతి గృహాల పరిస్థితి జిల్లాలో అధ్వాన్నంగా తయారైంది. ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలు ఏర్పాటు చేయకుండా అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లో నిర్వహిస్తూ విద్యార్థులతో చెలగాటం ఆడుతున్నారు. జిల్లాలో ప్రీ మెట్రిక్ వసతి గృహాలు 39, పోస్ట్ మెట్రిక్ (కాలేజీ) వసతి గృహాలు 15 ఉన్నాయి. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బిసి సంక్షేమ వసతి గృహాలు సొంత భవనాల్లో కొన్ని ఉంటే, అద్దె భవనాల్లోనే అధిక సంఖ్యలో ఉన్నాయి. మొత్తం 54 వసతి గృహాల్లో 3650 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన కులాల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహాలు ఇరుకైన భవనాల్లో ఉండటం వలన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని బిసి బాలుర వసతి గృహం (పాత రాజ్యలక్ష్మి సినిమా హాల్) పాడైన పురాతనమైన భవనంలో ఉంది. ఎప్పుడు పడిపోతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి జిల్లాలో ఉన్న అన్ని (మిగతా.. 3లో)



ఇరుకు భవనంలో కాలేజీ వసతి గృహం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శంకరరావు

'చేయూత' జమ చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

వైఎస్ఆర్ చేయూత డబ్బులు లబ్ధిదారులు బ్యాంకు ఖాతాలోకి జమ చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ చేయూత డబ్బులు లబ్ధిదారులకు ఇచ్చేందుకు బటన్ నొక్కారని, నేటికి చాలామంది మహిళలకు డబ్బులు జమ కాలేదని అన్నారు. ఎన్నికల ముందు అప్పటి ప్రభుత్వం ఇస్తామంటే ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ఎన్నికల అనంతరం వేయాలని కోరినా ప్రయోజనం లేకుండా పోతుందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే పాత సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని ప్రకటించినప్పటికీ ఆచరణలో పెట్టకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చేయూత డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన చేస్తామన్నారు. ఆయనతో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక పెద్ద వీధి శివాలయంలో బెహరా చెరువు గట్టుపై రావి, వేప మొక్కలను జియో వ్యవస్థాపకుడు బి. రామకృష్ణ, ఇంటి కోటేశ్వరరావు, పూడి రాజు ఆదివారం నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రావి చెట్టు అత్యధికంగా ప్రాణవాయువైన ఆక్సిజన్‌ను విడుదల చేస్తుందని, వేప చెట్టు చెడు బ్యాక్టీరియాను దరి చేరనివ్వదని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

రెండుగా విడిపోతున్న రోడ్డు

ప్రజాశక్తి - భోగాపురం



రెండుగా విడిపోయిన రోడ్డు

ఫార్మా కంపెనీ వేసిన పైప్ లైన్ కారణంగా చెరుకుపల్లికి వెళ్లే తారురోడ్డు మధ్యలో పగిలిపోయి రెండు ముక్కలుగా విడిపోతుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిప్పాడ సమీపంలోని ఒక ఫార్మా కంపెనీ గోస్తని నదిలోని తాడుత్తురు నుంచి పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నారు. ఇటీవల ఏడాది కిందట పైపులైను వేశారు. గుడివాడ వెళ్లే రహదారి నుంచి చెరుకుపల్లి తారురోడ్డును అనుకోని కాలువ లో నుంచి ఎనిమిది అడుగులు లోపల వేశారు. దీంతో పైప్ లైన్ వేసిన ప్రాంతమంతా కుంగి పోతుండడంతో తారు రోడ్డుకు మధ్యలో నుంచి పగుళ్ళు ఏర్పడ్డాయి. పగుళ్లకు మరమ్మతులు చేయాలని చెరుకుపల్లి గ్రామానికి చెందిన టిడిపి తెలుగు యువత అధ్యక్షుడు బైరెడ్డి తోగుల్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేకుండా పైపులైను వేసిన వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

నాగావళిని దోసేస్తున్నారు..

- బొడ్డవలస, రేగిడి, తునివాడ కేంద్రాలుగా ఇసుక అక్రమ రవాణా
- ఇసుకతో లక్షల వ్యాపారం
- పట్టించుకోని యంత్రాంగం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బొడ్డవలస, రేగిడి, తునివాడ గ్రామాలు కేంద్రాలుగా నాగావళి నదిలో ఇసుక అక్రమంగా తవ్వి వందలాది ట్రాక్టర్లు, లారీలతో పట్టణాలకు తరలించి ఇసుకను దోచేస్తున్నారు. ఈ గ్రామాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుకను అక్రమ రవాణా చేయడంతో ఇసుకాసురులు ప్రభుత్వ సంపదను దోచేస్తున్నారు. వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలుగుతోంది. రాత్రులందు జెసిపిలతో తవ్వించి లారీలతో విజయనగరం, విశాఖపట్నం, చెన్నై వంటి పట్టణాలకు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇసుకాసురుల ఆగడాలు రోజురోజుకీ మితిమీరిపోతున్నాయి. ఒక్కొక్క ట్రాక్టర్‌కు ఇసుకాసురులు రూ.5వేలు నుంచి రూ.7వేలు వరకు వసూలు చేస్తున్నట్లు ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఇసుక అక్రమంగా అమ్మకాలు చేపట్టడంతో ఇసుకాసురులు లక్షల రూపాయలు వెనుకేసుకుంటున్నారు. గ్రామ పంచాయతీ వనరులకు సంబంధించి ఇలా అక్రమ ఇసుక రవాణా చేయడం పట్ల పంచాయతీ పాలకవర్గం, సచివాలయ ఉద్యోగులు కనీసం పట్టించుకోకపోవడంతో వీరికి ముడుపులు అందుతున్నాయని విమర్శిస్తున్నారు. నాగావళి నదిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరించడం పట్ల అధికారులకు వారానికి ఒకసారి ముడుపులు అందుతున్నా యని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంకిలి గ్రామ పంచాయతీ పరిధి బొడ్డవలస వద్ద తారస్థాయిలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. దీని పక్కనే రాజాం -పాలకొండ ప్రధాన రహదారి వంతెన ఉంది. కాగా కాంగ్రెస్ ప్రభుత్వంలో తాగునీటి పైలెట్ ప్రాజెక్టును రూ.49 కోట్లతో ఇక్కడే నిర్మించి ఆరు మండలాలకు తాగునీటిని అందిస్తున్నారు. ఈ ఇసుక అక్రమ రవాణా వల్ల తాగునీటి ప్రాజెక్టులు దెబ్బ తినే అవకాశం ఉంది.




నాగావళి నదిలో ఇసుకను జెసిబితో పోగు వేస్తున్న అక్రమార్కులు



నదిలో తవ్విన ఇసుకను ట్రాక్టర్లకు ఎక్కిస్తున్న కూలీలు

రేగిడి నాగావళి వద్ద రాజాం, రేగిడి మండలాలకు వెళ్లే తాగునీటి పైలెట్ ప్రాజెక్టును ఆనుకుని ఇసుకను తవ్వేయడంతో ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అసలు ఈ గ్రామాల వద్ద ఎటువంటి అనుమతులూ లేకుండా యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేయడం పట్ల ఎవరి హస్తముందో అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదు. మండలంలో ట్రాక్టర్ యజమానుల అంతా కలిసి ఇసుక అక్రమ రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్నారని వీరిని సమావేశం పరిచి ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తే ఇసుక అక్రమ రవాణాకు అడ్డకట్టపడేదని పలువురు భావిస్తున్నారు. అయితే ట్రాక్టర్ యజమానులే అధికారులకు మామూళ్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వాలు మారినా ఇసుక దందా మారడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి, పర్యవేక్షణ జరిపి, ప్రభుత్వ సంపదను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ట్రాక్టర్ ద్వారా తరలిపోతున్న ఇసుక

సుంకు పురుగులు నుంచి రక్షించండి

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలంలోని గర్భాం, బైరిపురం వద్ద ఉన్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ నుంచి వస్తున్న సుంకి పురుగుల నుంచి తమను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాలలో ఉన్న రైస్ మిల్లుల నుంచి ఇక్కడకు బియ్యం వస్తుంటాయి. వాటిని ఈ గోడౌనలలో నిల్వ ఉంచుతారు. ఆ వచ్చిన బియ్యం బస్తాలను పరిశుభ్రం చేసి సుమారు నలభై ఒక్క రోజు ఉంచి ఆ తరువాత వివిధ ఎంఎల్ఎస్ పాయింట్లకు తరలిస్తారు. అయితే ఈ గోడౌన్ లలో బియ్యం నిల్వ ఉండేటపుడ వాటికి సుంకు పురుగులు విపరీతంగా పడతాయి. అందుకు ఎక్కువుగా మందులు కొట్టడం, బస్తాలపై పిచికాహారి చేయడం వంటివి చేయాలి. సుంకు పురుగల నివారణకు ఎటువంటి మందులూ వాడకపోవడంతో ఈ పురగులు ఆ గోడౌన్ ఉన్న ప్రాంతం నుంచి సుమారు ఆరు, ఏడు కిలో మీటర్లు వరకు వ్యాప్తి చెంది ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. సమీప గ్రామ ప్రజలు తమ ఇళ్ల తలుపులు తీసారంటే చాలు ఒకే సారి ఇంట్లోకి చొరబడుతున్నాయి. వారు తింటున్న భోజనంలో కూడా అవి కలిసి పోతున్నాయంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చును. నిద్ర పట్టక, ఇల్లులు ఖాళీ చేసి వెళ్ళిపోలేక దిక్కు తోచని స్థితిలో ప్రజలు జీవిస్తున్నారు. ఎన్ని మార్లు సంబంధిత అధికారులకు మొర పెట్టుకొన్నా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ సమస్యపై స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



సుంకుపురుగులకు కారణమైన గిడ్డంగుల సంస్థ ఇదే..

చీరాల ఘటన దుర్మార్గం

ప్రజాశక్తి- బొబ్బిలి

బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపురుపాలెంలో 21 సంవత్సరాల యువతిని అత్యాచారంచేసి చంపేసి రైలు పట్టాల పక్కన పడి వేయడం దుర్మార్గమని కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకులు మువ్వల శ్రీనివాసరావు అన్నారు. ఈ ఘటనను ఆ పార్టీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రంలో మహిళలకు ఏమాత్రం రక్షణ లేదనడానికి ఇది నిదర్శన మన్నారు. యువత మద్యం, డ్రగ్స్, గంజాయి మత్తుకు బానిసలై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలని డిమాండ్ చేశారు. ఈపురుపాలెం నిందితులను కఠినంగా శిక్షించి ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చూడాలని డిమాండ్ చేశారు.

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బలంకి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, మెటీరియల్‌ను శ్రీవాసవి క్లబ్ అందజేసినట్లు సిఆర్‌పి సునందని ఆదివారం తెలిపారు.



పుస్తకాలతో విద్యార్థులు

మూడో రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - కొత్తవలస

జిందాల్ పరిశ్రమ అక్రమ లాకౌట్ ఎత్తివేయాలని కోరుతూ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి మూడవ రోజుకు చేరాయి. జిందాల్ యాజమాన్యం లాకౌట్ పేరుతో కార్మికులను బయటకు నెట్టి నేటికి 38 రోజులు గడుస్తున్నా కనీసం స్పందించుకోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత 40ఏళ్ల నుంచి పని చేస్తున్న కార్మికులను ఎటువంటి కారణం లేకుండా లే ఆఫ్ పేరుతో కంపెనీ బయట ఉంచడం విచారకరమని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిందాల్ యాజమాన్యం దిగివచ్చి కార్మికులందరికీ భేషరతుగా పనిని కల్పించాలని కోరారు. జిందాల్ కర్మాగారంలో కార్మిక సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నామని నాయకులు అన్నారు. జెఎసి నాయకత్వంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిందాల్ జెఎసి నాయకులు పిల్లా అప్పలరాజు, గాడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



నిరాహార దీక్ష చేస్తున్న జిందాల్ కార్మికులు

ప్రజాశక్తి
సోమవారం 24 జూన్ 2024

పంపిణీకి సిద్ధంగా విత్తనాలు, ఎరువులు



- 2,99,455 ఎకరాల్లో పంటల సాగు
- 2,25,145 ఎకరాల్లో వరి
- ఆశాజనకంగా వాతావరణం
- 'ప్రజాశక్తి'తో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విటి రామారావు ముఖాముఖి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు ప్రణాళికకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విటి.రామారావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,99,455 ఎకరాల్లో వివిధ పంటల సాగుకు రైతులు సన్నద్ధమౌతున్నారని, ఇందులో అత్యధికంగా 2,25,145 ఎకరాల్లో వరి సాగవుతుందని స్పష్టం చేశారు. ఎరువులు, విత్తనాలను రైతులు ప్రభుత్వ సబ్సిడీ ధరకే అందజేస్తామని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సివుంటుందని హెచ్చరించారు. ఈ ఏడాది సకాలంలో నైరుతి రుతుపవనాలు జిల్లాను తాకడంతో ఉబాలు సకాలంలో పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తనను కలిసిన ప్రజాశక్తికి వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఖరీఫ్‌లో సాగు లక్ష్యం ఎంత?
ప్రస్తుతం సాగు ఎంతవరకు వచ్చింది?

గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా అన్ని పంటలూ కలుపుకుని 2,84,807 ఎకరాల్లో సాగయ్యాయి. ఈ ఏడాది 2,99,455 ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేశాం. ఇందులో ఇప్పటి వరకు 2,500 ఎకరాల వరకు సాగైంది. వీటిలో మొక్కజొన్న, నువ్వులు, పత్తి, అపరాలు ఉన్నాయి. గత ఏడాది కూడా ఈ సమయానికి దాదాపు అంతే విస్తీర్ణంలో పంటల సాగు ఉంది.

ఖరీఫ్‌లో ప్రధానమైన పంటలేమిటి?

ఖరీఫ్‌లో అన్ని పంటలూ కలుపుకుని సుమారు 30రకాలు సాగవుతాయి. కానీ, వరి, మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులే ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతాయి. ఇందులోనూ అత్యధికంగా వరి ఈ ఏడాది 2,25,145 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేశాం. మొక్కజొన్న 35,055 ఎకరాల్లోనూ, నువ్వులు 14,007 ఎకరాల్లోనూ, వేరుశనగ 1,487.5 ఎకరాలు, చెరకు 15,040 ఎకరాల్లోనూ సాగు కానుంది. గత ఏడాది వరి 2.84,807 ఎకరాలు, మొక్కజొన్న 25,695 ఎకరాలు, నువ్వులు 10,012 ఎకరాలు, వేరుశనగ 477 ఎకరాల చొప్పున సాగయ్యాయి. వీటికి తోడు సామలు, కొర్రలు, మినుములు, పెసలు, కందులు వంటివి కూడా సాగయ్యాయి.

ఈ ఏడాది ఏయే రకాల వరివిత్తనాలను ప్రోత్సహిస్తున్నారు?

మొత్తంగా 11రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉంచినప్పటికీ, భూసారం, నీటి లభ్యత, ఆశాజనకమైన ఉత్పత్తిని దృష్టిలోపెట్టుకుని ఎంటియు - 1121, ఎంటియు - 1224 వెరైటీలను ఎక్కువగా ప్రోత్సహిస్తున్నాం. ఆ తరువాత స్థానంలో బిపిటి - 3291, బిపిటి 5204 రకాలు ఉంటాయి. వీటితోపాటు అతి తక్కువ విస్తీర్ణంలో ఎంటియు - 7029, ఎంటియు - 1318, ఎంటియు -10614, ఆర్‌జిఎల్ - 2537, ఎంటియు - 1061, ఆర్ఎన్ఎల్ - 15048, ఎన్ఎల్ఆర్ - 34449 రకాలు కూడా ఉన్నాయి.

విత్తనాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయా?

ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన వరి, వేరుశనగ, నువ్వులు, పెసలు, మినుములు, కందులు, రాగులు, పిల్లిపెసర తదితర విత్తనాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయి. ఈ సీజన్‌లో అన్నిరకాల పంటల సాగుకు సంబంధించి 50,267 క్వింటాళ్ల విత్తనాలు ప్రభుత్వం కేటాయించగా, ఇప్పటికే 35,973 క్వింటాళ్లు జిల్లాకు చేరాయి. ఇందులో 9,323 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు పంపిణీ చేశాం. మిగిలినవన్నీ ఆర్‌బికెల్లోనూ, ప్రైవేటు డీలర్ల వద్ద అన్ని ప్రాంతాల్లోనూ అందుబాటులో ఉన్నాయి. వరిలో అత్యధికంగా ఎంటియు - 1121 విత్తనాలు 35.154 క్వింటాళ్లు రావాల్సివుండగా, ఇప్పటికే 28,043 క్వింటాళ్లు జిల్లాకు చేరాయి. ఇందులో సుమారు 5వేల క్వింటాళ్ల వరకు రైతులకు పంపిణీ చేశాం. అన్నిరకాల వరి విత్తనాలు కలుపుకుని 46,530 క్వింటాళు రావాల్సి వుండగా, ఇప్పటికే 33,389 క్వింటాళ్లు జిల్లాకు చేరాయి. ఇందులో 6,978 క్వింటాళ్ల మేర పంపిణీ చేశాం.

ఎరువులు అందుబాటులో ఉన్నాయా?

ఎరువులు పుష్కలంగా ఉన్నాయి. ఈ సీజన్‌కు సంబంధించి ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు నెలవారీగా వివిధ రకాల ఎరువులు ఎంతెంత మోతాదులో అవసరమౌతాయనేది ప్రణాళిక రూపొందించాం. ఈలెక్కన సీజన్ మొత్తానికి యూరియా 26,662 మెట్రిక్ టన్నులు, డిఎపి 11,164 మెట్రిక్ టన్నులు, ఎంఒపి 2,235 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పి 1,545 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 9,871 మెట్రిక్ టన్నుల చొప్పున 51,476 మెట్రిక్ టన్నుల మేర అవసరం కానుంది. ఇందులో ఇప్పటికే 23,713 మెట్రిక్ టన్నులు జిల్లాకు చేరింది. అత్యధికంగా యూరియా 17,206 మెట్రిక్ టన్నులు, డిఎపి 3,964, ఎంఒపి 465మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పి 657 టన్నులు, ఎన్‌పికెఎస్ 1421 టన్నుల మేర ఉంది.

ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉందా?

కొన్నేళ్లతో పోలిస్తే ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉంది. సీజన్ ప్రారంభ సమయానికే నైరుతి రుతుపవనాలు జిల్లాను తాకాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం (జూన్1) నుంచి ఇప్పటి వరకు 99.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సివుండగా 148.7 మి.మీ వర్షపాతం నమోదైంది. 49 మి.మీ వర్షం అధికంగా కురిసింది. దీంతో, రైతులు నారు మడులు అదును చేసుకుంటున్నారు. వర్షాలు కొనసాగితే ఆగస్టు నాటికి ఉబాలు పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



నగరంలో పాత భవనంలో నడుస్తున్న బిసి ప్రీమెట్రిక్ వసతి గృహం

సంక్షోభ వసతి గృహాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ వసతి గృహాల్లోనూ నెలకొంది. 20 ఏళ్ల కిందట నిర్మించిన వసతి గృహాలు కావడంతో అధ్వాన్నంగా ఉన్నాయి. ఇప్పటికే కస్పా వీధిలో ఉన్న వసతి గృహాన్ని మార్చేసిన విషయం తెలిసిందే. మరో వైపు ప్రైవేటు అద్దె భవనాల్లో ఉన్న వసతి గృహాలు ఇరుకు గదుల్లో ఉన్నాయి. ప్రీమెట్రిక్ వసతి గృహాల్లో 2050 మంది, కాలేజీ వసతి గృహాల్లో 1600 మంది విద్యార్థులు చదువుతున్నారు. కాలేజీ వసతి గృహాల్లో వందల మంది ఉండటం, సరిపడా వసతి లేకపోయినా విద్యార్థులు నెట్టుకొస్తు న్నారు. విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో జిల్లా కేంద్రమైన విజయనగరం రావడం వల్ల వసతి గృహాల సీట్లకు పోటీ ఎక్కువగా ఉంది. దీంతో నగరంలో శాశ్వత వసతి గృహాల నిర్మాణం చేయాల్సి ఉంది. ప్రభుత్వాలు ఎన్ని మారుతున్న వసతి గృహాల విషయంలో శాశ్వత పరిష్కారం చూపే ప్రయత్నం చేయకపోవడం విద్యా రంగం పట్ల పాలకులకు ఉన్న చిత్త శుద్ధికి నిదర్శనం. ఇప్పటికైనా శాశ్వత భవనాలు ఏర్పాటు చేసి విద్యార్థులను ఇబ్బందుల నుంచి తొలగించాలని కోరుతున్నారు.

వసతి గృహాలకు శాశ్వత భవనాలు నిర్మించాలి



జిల్లాలో బిసి ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు శాశ్వత భవనాలు నిర్మించాలి. అద్దె భవనాల్లో ఉన్న వాటికి మౌలిక వసతులు కల్పించి అదనంగా అదనపు భవనాలు ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు వసతి గృహాల్లో ఎటువంటి సమస్యలూ తలెత్తకుండా పరిష్కరించాలి.

డి.రాము, ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెవిఆర్‌కె ఈశ్వరరావు

జీవో 117ను రద్దు చేయాలి

యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసే జీఓ 117 ను రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక ఎన్‌పిఆర్ భవనంలో జిల్లా అధ్యక్షులు రమేష్ చంద్ర పట్నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జెవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ జీఓ 117 ద్వారా 3,4,5 తరగతులు విలీనం చేయడం వల్ల ప్రాథమిక విద్యలో చేరుతున్న వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే 117 జీఓ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్ని పాఠశాలల్లో ఒకే రకమైన సిలబస్‌ను అమలు చేయాలన్నారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సి అమలు చేయాలని, డిఎస్‌సిలో ఉపాధ్యాయులకు అప్రంటీస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు కె విజయాగౌరి, కె.శ్రీనివాసరావు, డి.రాము, సత్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎండిఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నాయకులు
అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులిచ్చేందుకు తీర్మానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం (సిఐటియు) డిమాండ్ చేసింది. ఆదివారం ఆ సంఘం విజయనగరం అర్బన్ అండ్ రూరల్ సమావేశం టి.లక్ష్మి అధ్యక్షతన ఎల్‌బిజి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్ రావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2019లో ఇస్తున్న రూ.3వేలు వేతనమే నేటికీ అమలులో ఉందని, ప్రభుత్వం వృద్ధులకు ఇస్తున్న సామాజిక పెన్షన్ కంటే ఇది తక్కువే అన్నారు. కనీస రూ.10వేలు వేతనం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వర్కర్లను పెంచాలని, గతంలో హైస్కూల్‌కు పంపిన ఎలిమెంటరీ పిల్లలను తిరిగి ప్రాథమిక పాఠశాలకు అప్పగించాలని, మెనూ ఛార్జీలను విద్యార్థికి రూ.20 చొప్పున ఇవ్వాలని, గ్యాస్ ఉచితంగా ఇవ్వాలని కోరారు. మరమ్మత్తులకు




సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్‌రావు

స్కూల్ గ్రాంట్స్ ద్వారా నిధులు ఇవ్వాలని, పని భద్రత కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ సమస్యలపై స్థానిక ఎమ్మెల్యేలను, విద్యాశాఖ అధికారులను నెలాఖరులోగా కలసి వినతులు ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం 13మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. డి.అచ్చియ్యమ్మ, కె.సాయి, కె.స్వప్న, కె.రమణ, శ్రీలక్ష్మి, బి.భారతి, ఆర్. అప్పలనరసమ్మ, ఆర్.అదిలక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

కుదేలైన పరిశ్రమలు

- ప్రభుత్వ విధానాలతో జ్యూట్ మిల్లుల మూత
- పెట్టుబడిదారులను పెంచేందుకు పంచదార మిల్లులు మాయం
- విద్యుత్ ఛార్జీల పెంపుతో ఫెర్రో ఎల్లాయిూస్ కుదేలు
- ఆశలన్నీ ఎంఎస్ఎంఇ మంత్రి శ్రీనివాస్ పైనే



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పెట్టుబడిదారులకు ఊడిగం చేసే ప్రభుత్వ విధానాలు, వ్యవసాయ రంగంలో కొన్ని దశాబ్ధాలుగా వచ్చిన మార్పులు ఫలితంగా పంటల మార్పిడితో గడిచిన రెండు దశాబ్ధాలలో జిల్లాలోని అనేక పరిశ్రమలు మూత పడ్డాయి. మరికొన్ని ఒడిదొడుకుల మధ్య నడుస్తున్నాయి. ఫలితంగా వేలాది కుటుంబాలు జీవనోపాధి కోల్పోయాయి. వారి ఆర్థిక స్థితిగతులు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్‌కు సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమల మంత్రి పదవి రావడంతో ఆశలు చిగురిస్తున్నాయి. మనసుపెడితే వాటిలో కొన్నైనా పునరద్ధరణకు నోచుకునే అవకాశం ఉటుందని, నేటి పరిస్థితులకు అనుగుణంగా మరికొన్ని పరిశ్రమలు ఏర్పాటుకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని జిల్లా వాసులు ఆశగా చర్చించుకుంటున్నారు.

ఉనికి కోల్పోయిన జ్యూట్ మిల్లులు

విజయనగరం జిల్లా ఒకప్పుడు జ్యూట్ మిల్లులకు పుట్టినిల్లు. జనపనార, గోగు (మెస్తా) కలిపి జ్యూట్ ఉత్పత్తులు తయారయ్యేవి. ఉత్తరాంధ్ర నేలలు గోగు సాగుకు అనుకూలంగా ఉండడంతో ఈ ప్రాంతంలో ఎక్కువగా జ్యూట్‌మిల్లు ఆవిర్భవించాయి. గోగు నారను జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన ప్రభుత్వం కొనుగోలు చేసేది. అప్పట్లో గోగు నార కొనుగోలుకు గ్యారెంటీ ఉండడంతో రైతులు విరివిరిగా సాగు చేసేవారు. 1990 నాటికి విజయనగరం జిల్లాలో 57వేల ఎకరాల్లో గోగు సాగయ్యేది. అనంతర కాలంలో జ్యూట్ ఉత్పత్తుల స్థానంలో ప్లాస్టిక్, మైకా వంటి ప్రత్యామ్నాయ ఉత్పత్తులు అందుబాటులోకి రావడం, నార కొనుగోలుకు ప్రభుత్వం ఆసక్తి చూపకపోవడం వంటి కారణాల వల్ల గోగు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోయింది. ప్రస్తుతం విజయనగరం జిల్లాలో 5వేల ఎకరాల్లో సాగవుతున్నట్టు రికార్డుల్లో పేర్కొంటున్నప్పటికీ ఆచరణలో అంత కనిపించడం లేదు. ఈ క్రమంలో విజయనగరంలోని అరుణా, ఈస్టుకోస్టు, బొబ్బిలిలో నవ్య, శ్రీ లక్ష్మి శ్రీనివాస, జ్యోతి, కొత్తవలసలో మరో మిల్లు శాశ్వతంగా మూతపడ్డాయి. నెల్లిమర్ల జూట్‌మిల్లు ఒకప్పుడు 6వేల మంది కార్మికులకు గాను క్రమంగా ఉత్పత్తి తగ్గించడంతో కార్మికుల సంఖ్య 400కు తగ్గిపోయింది. ప్రస్తుతం సాలూరు (జీగిరాం) జ్యూట్ మిల్లు, కొత్తవలసలోని ఉమా జ్యూట్‌మిల్లు ఒడిదొడుకుల మధ్య నడుస్తోంది. ఒకప్పుడు జిల్లాలోని మొత్తం జ్యూట్ మిల్లుల్లో 25వేల మంది కార్మికులు పనిచేసేవారు. ప్రస్తుతం 1000 మందికి కూడా ఉపాధి దొరకడం లేదంటే అతిశయోక్తి కాదు.

బకాయిలు చెల్లించమంటే పరిశ్రమనే అమ్మేశారు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో రెండే రెండు చక్కెర పరిశ్రమలు ఉండగా, గత ప్రభుత్వ హయాంలో మూతపడ్డాయి. లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ సుగర్స్ ప్రయివేటు ఆధ్వర్యాన, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ సహకార రంగంలో ఉండేవి. ఏటా 3.50లక్షల మెట్రిక్ టన్నులు క్రషింగ్ సామర్థ్యం ఉన్న ఎన్‌సిఎస్ సుగర్స్‌పరిధిలో చెరకు రైతులకు ప్రభుత్వం తరపున తగినంత ప్రోత్సాహం లేకపోవడం వల్ల సాగు తగ్గినప్పటికీ కొంతకాలంగా ఏటా 2.13లక్షల నుంచి 1.50మెట్రిక్ టన్నుల వరకు క్రషింగ్ జరిగేది. దశాబ్ధకాలంగా చెరకు రైతులకు బిల్లులు చెల్లించకపోవడంతో చెరకు రైతుల సంఘం ఆధ్వర్యాన పెద్ద ఉద్యమమే జరిగింది. రైతుల డబ్బును దారి మళ్లించి, రైతుల అప్పులు తీర్చేపేరిటా యాజమాన్యం తన ఆస్తులను విక్రయానికి పెట్టింది. ఫలితంగా ఫ్యాక్టరీ మూతపడింది. ఇదంతా గత పాలకుల కనుసన్నల్లోనే జరిగింది. దీంతో, ఇందులో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులతోపాటు ఈ ఫ్యాక్టరీ పరిధిలో దాదాపు 7వేల ఎకరాల్లో చెరకు సాగుచేసే సుమారు 2వేల మంది రైతులు కూడా జీవనోపాధి కోల్పోయారు.



భీమసింగి సుగర్ పరిశ్రమ

ఆధునీకరణ పేరుతో మూసేసిన భీమసింగి సుగర్స్

భీమసింగి సుగర్ ఫ్యాక్టరీలో ఆధునీకరణ పేరుతో ఉత్పత్తిని నిలిపివేసిన గత ప్రభుత్వం చివరకు ఏకంగా ఎత్తేసింది. ఆడలేక మద్దెల ఓడు అన్నట్టుగా ఫ్యాక్టరీని నడిపే ఉద్ధేశం లేక ఫ్యాక్టరీ సామర్థ్యానికి తగ్గట్టు రైతులు చెరకు ఉత్పత్తి చేయడం లేదని గత ప్రభుత్వంలోని మంత్రి సెలవిచ్చారు. వాస్తవానికి చెరకు రైతుల నష్టానికిగానీ, ఫ్యాక్టరీ సంక్షోభానికిగాని రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడం, ఫ్యాక్టరీని ఆధునీకరించకపోవడమే కారణం. దీంతో, జిల్లాల పునర్విభజనలో భాగంగా కలిసిన సంకలి సుగర్ ఫ్యాక్టరీకి రైతులు చెరకు తరలించుకోవాలని పాలకులు ఉచిత సలహా ఇచ్చారు. ఇది రైతులకు అత్యంత కష్టతరంగా మారింది. భీమసింగి ఫ్యాక్టరీ మూతతో కార్మికులు పూర్తిగా ఉపాధి కోల్పోయారు.

మూతపడిన ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ



ఒడిదుడుకుల నడుమ ఫెర్రో ఎల్లాయిూస్

ఫెర్రో ఎల్లాయిూస్ పరిశ్రమలు రాష్ట్ర వ్యాప్తంగా 21 ఉండగా ఒక్క విజయనగరం జిల్లాలోనే 14 వరకు ఉన్నాయి. మన జిల్లాలో నాణ్యమైన మాంగనీస్ గనులు ఎక్కువగా ఉండడం ఇందుకు కారణం. స్థానికంగా గనులు ఉన్నప్పటికీ ముడిసరుకు (మాంగనీస్ గనులు) గరివిడి ఫేకర్, కొత్తవలసలోని జిందాల్‌కు మినహా మిగిలిన పరిశ్రమలకు సొంత గనులు లేవు. దీంతో, గనులు కొనుగోలు చేసి, స్టీల్‌ప్లాంట్‌లకు, ఇతర కంపెనీలకు ఉపయోగపడే ఫెర్రోక్రోం తయారీ చేయడానికి అధిక మొత్తంలో ఖర్చు అవుతోంది. దీనికితోడు చాలా కాలంగా విద్యుత్ రాయితీలు ఎత్తివేయడంతో పెట్టుబడి పెరిగిపోతోంది. అంతర్జాతీయ మార్కెట్‌ను తట్టుకోలేక పోవడంతో స్థానిక పరిశ్రమలు ఎప్పటికప్పుడు మూతపడక తప్పడం లేదు. ఫెర్రో ఎల్లాయిూస్ మనుగడ అంతర్జాతీయ మార్కెట్‌తో ముడిపడి ఉండడంతో తీవ్ర ఒడిదుడుకులతో నడుస్తున్నాయి. దీంతో, ఏటా ఫెర్రో క్రోం ఉత్పత్తులు తగ్గుతున్నాయి. అందుకు తగ్గట్టే కార్మికుల ఉపాధిలోనూ కోత పడుతోంది.



ఎమ్మెల్యే కళావెంకటరావును సన్మానిస్తున్న కూటమి నాయకులు, కార్యకర్తలు

చీపురుపల్లి ప్రజల రుణం తీర్చుకుంటా : కళా

ప్రజాశక్తి-చీపురుపల్లి

తనను గెలిపించి అసెంబ్లీకి పంపించిన చీపురుపల్లి నియోజకవర్గ ప్రజల రుణాన్ని తీర్చుకుంటానని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. ఇటీవల శాసనసభలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా ఆదివారం చీపురుపల్లి వచ్చిన కళా వెంకటరావుకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. విశాఖ విమానాశ్రయానికి తరలి వెల్లిన నాయకులు, కార్యకర్తలు భారీ కార్ల ర్యాలీతో చీపురుపల్లి వరకు ఆయన్ను తీసుకు వచ్చారు. చీపురుపల్లిలో భారీ కటౌట్లు ఏర్పాటు చేసి ప్రజలు స్వాగతం పలికారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్న ఆయన్ను నాయకులు, అధికారులు పెద్ద ఎత్తున కలిసి అభినందనలు తెలిపారు.

అనంతరం కళావెంకటరావు మాట్లాడుతూ తోటపల్లి పనులను పూర్తి చేసి ఈ ప్రాంత రైతులకు సాగు నీరందిస్తానని చెప్పారు. నియోజకవర్గంలో మూత పడి ఉన్న ఫెర్రో, ఇతర పరిశ్రమలను తెరిపిస్తానని తెలిపారు. తోటి ఎమ్మెల్యేలందరినీ కలుపుకొని విజయనగరం జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, నాయకులు కె త్రిమూర్తులు రాజు, నియోజకవర్గ టిడిపి పార్టీ బిసి సెల్ అధ్యక్షుడు ముల్లు రమణతో పాటు నాలుగు మండలాల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా నగరంలో ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఒలింపిక్ డే రన్ ఉత్సాహంగా జరిగింది. స్థానిక ఆర్అండ్‌బి జంక్షన్ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గర వరకు రన్ జరిగింది. పెద్దఎత్తున యువత, క్రీడాకారులు పరుగులో పాల్గొన్నారు. పరుగులో పాల్గొన్న వారికి నిర్వాహకులు టీషర్టులు, టోపీలు అందజేశారు. ఒలింపిక్ జ్యోతులను జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు గురాన అయ్యలు వెలిగించి ఒలింపిక్ డే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మాట్లాడుతూ క్రీడా కారులలో సమానత్వం కలిగించి, క్రీడాకారులకు క్రీడా స్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతో ఒలింపిక్ డేరన్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి సిహెచ్ వేణుగోపాలరావు మాట్లాడుతూ చిన్న తనం నుంచే క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. గ్రామ స్థాయి నుండే వివిధ విభాగాల్లో మంచి ప్రతిభ కనబరచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సత్య డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ సాయి దేవమణి, గాయత్రి విద్య సంస్థల ఛైర్మన్ అల్లు నరేంద్ర, ఒలింపిక్ సంఘం సభ్యులు భగవాన్ దాస్, మల్లేశ్వరరావు, రమణ, శ్రీనివాస్, స్కేటింగ్ , వెయిట్ లెఫ్ట్ ఇంటర్నేషనల్ క్రీడాకారులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న క్రీడాకారులు, యువకులు



శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును ఆదివారం ఆమరావతిలో రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి సత్కరించారు.

- ప్రజాశక్తి, విజయనగరంకోట









వాలంటీర్ల ఎంపికకు రాయ(బా)'బేరాలు'..?

- అవినీతికి తెరలేపుతూ గుట్టుగా సమావేశం
- కనీస రేటుగా రూ.50వేలు

ప్రజాశక్తి - మక్కువ

కొత్తగా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వం వాలంటీరు వ్యవస్థపై శాసనపరమైన నిర్ణయాలు ఏమీ తీసుకోనప్పటికీ మండలంలో మాత్రం వాలంటీర్ల ఎంపికకు బేరాలకు తెరలేచింది. గత వైసిపి ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి మండలంలో సుమారు 350మంది వాలంటీర్ల నియామకాన్ని చేపట్టింది. ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, వారి వేతనాన్ని రూ.10వేలకు పెంచుతామని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మండలంలోని వాలంటీర్ల ఎంపికకు అప్పుడే రహస్యంగా చర్చలు జరుపుతూ ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారి నుంచి విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు సేకరిస్తున్నట్లు సమాచారం. అదే పనిలో కొంతమంది కొన్ని ఖర్చులుంటాయని చెబుతూ సుమారు రూ.50 వేలకు పైబడి చెల్లించాల్సి ఉండొచ్చని ఆశావాహులకు తెలుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే గతంలో కంటే ఈసారి సగానికి సగం వాలంటీర్ల నియామకం తగ్గే ఆస్కారం ఉంటుందన్న ప్రచారంతో వాలంటీర్ల ఎంపిక కోసం అభ్యర్థుల పోటీ ఎక్కువైంది. దీంతో ఎక్కువ మంది ఆశావాహులు పోటీ పడడంతో ఇదే అదునుగా కొంతమంది భావించి అందిన కాడికి దోచుకోవచ్చున్న ఉద్దేశంతో బేరాలకు తెరలేపుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఏ విధమైన ఆదేశాలు లేకుండా వాలంటీర్ల ఎంపికపై రాయబారాలు జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతుంది. ఈ అంశంపై ఏ ఒక్కరూ దళారుల వలలో పడి మోసపోవద్దని టిడిపి సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావునాయుడు తన అనుచరులను హెచ్చరిస్తూ యువత అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి అంశాలపై వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కార్యకర్తలకు సూచించినట్లు తెలిసింది.


స్వచ్ఛంద రక్తదానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆపదలో ఉన్నవారికి అత్యంత అవసరమైన రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని కన్స్యూమర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.అచ్చిరెడ్డి పేర్కొన్నారు. మాతృభూమి సేవా సంస్థ అధ్యక్షులు ఇప్పలవలస గోపి పుట్టినరోజును పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని ఎన్‌విఎన్ రక్తనిధి కేంద్రంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని ప్రారంభించిన అచ్చిరెడ్డి మాట్లాడుతూ రక్తదానం పట్ల అపోహలు వీడాలని, రక్తదానం చేసిన వ్యక్తి చురుకుగా, ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. గోపి మాట్లాడుతూ రక్త నిధి కేంద్రాల్లో రక్తం నిల్వల కొరతను అధిగమించేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, బంటు అజయ్, అన్నదాత సుఖీభవ సంస్థ అధ్యక్షురాలు కాంచనతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన యువత పాల్గొన్నారు.









కదలని బహుళ ప్రయోజన గిడ్డంగి పనులు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రైతులు తాము పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు వీలుగా పార్వతీపురం పట్టణంలో ప్రారంభించిన బహుళ ప్రయోజన గిడ్డంగి నిర్మాణ పనులు ముందుకు కదలగడంలేదు. 2022 డిసెంబర్ 1న రూ.40లక్షల నిధులతో అప్పటి స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు పట్టణంలోని 16వ వార్డులో పరిధి గల జంఝావతి నీటిపారుదల శాఖ కార్యాలయానికి సంబంధించిన స్థలంలో శంకుస్థాపన చేశారు. అయితే ఈ పనులు ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నప్పటికీ నిర్మాణ పనులు పునాదుల వరకే జరిగి నిలిచిపోయాయి. రైతు తాము పండించిన పంట చేతికొచ్చిన సమయంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల పండిన పంట భారీ వర్షాలకు నీట మునిగింది. ఆ పంటను ఈ బహుళ ప్రయోజన గెడ్డంగిలో ఆరబెట్టుకుని, నిల్వ చేసుకునేందుకు వీలుగా ఉంటుందన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సంబంధిత కాంట్రాక్టర్ నీరుగార్చారనే చెప్పొచ్చు. అయితే పర్యవేక్షించాల్సిన సంబంధిత శాఖ అధికారులు ఆ నిర్మాణం ఏ స్థాయి వరకు వచ్చిందో కనీసం చూడకపోవడం రైతుల పట్ల అటు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, సంబంధిత శాఖ అధికారులకు ఎంత చిత్తశుద్ధి ఉందో ఈ నిర్మాణం చూస్తేనే తెలుస్తోంది. ఇప్పటికైనా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర దృష్టి పెట్టిన సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి ఈ బహుళ ప్రయోజన గెడ్డంగి నిర్మాణం పూర్తిచేసే దిశగా అడుగులు వేయాలని రైతులు కోరుతున్నారు.


నిలిచిపోయిన గిడ్డంగి భవన నిర్మాణ పనులు

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వీరఘట్టం

పేదరికం వెక్కిరిస్తున్నా...పట్టు విడవకుండా చదివి ఆంధ్రా యూనివర్సిటీలో న్యాయ శాస్త్ర విద్యలో ప్రవేశం పొందగలిగాడు. ఓ వైపు న్యాయ శాస్త్ర విద్యను అభ్యసిస్తూ, మరోవైపు సివిల్ సర్వీస్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. వివరాల్లోకి వెళితే...


ఆర్థిక సాయం చేస్తున్న దిలీప్‌కుమార్

వీరఘట్టం మండలం పనస నందివాడకు చెందిన బొచ్చ కల్యాణ్ నిరుపేద విద్యార్థి. బాగా చదువుకుని పదిమందికి సేవ చేయాలన్న సంకల్పం ఉన్నవాడు. అయితే, పేదరికం అడుగడుగునా వెనక్కి లాగుతూనే ఉంది. కల్యాణ్ ఆర్థిక పరిస్థితిని కోనాడ సూర్యనారాయణ మాస్టర్ ద్వారా విషయం తెలుసుకున్న దిలీప్ కుమార్ తన మిత్రులతో చర్చించి కల్యాణ్ చదువుల నిమిత్తం రూ.8వేలు సేకరించి అందజేశారు. ఆర్థిక సాయం అందించిన మిత్రబృందానికి కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. పే బ్యాక్ టు సొసైటీ అన్న నినాదమే మన విధానం కావాలని ఈ సందర్భంగా దిలీప్ కుమార్ పిలుపునిచ్చారు.

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు జిల్లా నలుమూలల నుంచి కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలివచ్చారు. వేసవి తాపం అధికంగా ఉండడంతో పర్యాటకులు కొద్దిసేపు సేద తీర్చుకోవడానికి పార్కు జలపాతాలు ఆడలి యు పాయింట్ సందర్శించారు. పార్కులో జల విహార వద్ద బోట్ షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెరలు కొట్టారు. జెయింట్ వీల్ ఎక్కే అవకాశంలో ఉయ్యాలో ఉగారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి ఆడుకున్నారు. మినీ బోటింగ్ చేశారు. అనంతరం మెట్టుగూడ జలపాతం సందర్శించారు. ఆడలి ఈ పాయింట్ సందర్శించి ప్రకృతి అందాలు మైమరిపించే ఆకర్షణీయంగా కనువిందు చేశాయి

ఘనంగా ఒలింపిక్ డే

ప్రజాశక్తి- శృంగవరపుకోట

అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా స్థానిక భవాని నగర్‌లో గల డాక్టర్ వరలక్ష్మీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయుడు గొర్లె రాము, ప్రిన్సిపల్ వై జానకి దేవి ఆధ్వర్యంలో ఆ స్కూల్ నుంచి జవహర్ నవోదయ విద్యాలయం వరకు 5 కిలోమీటర్ల పరుగు పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.జానికి దేవి మాట్లాడుతూ శారీరక వ్యాయామం విద్యార్థులకు ఏకాగ్రత, పఠణా శక్తి, శారీరక ధృఢత్వం కలుగుతుందని, క్రమశిక్షణతో కూడిన నడవడిక అలవడుతుందని అన్నారు



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

రథ యాత్రకు సిద్ధమవుతున్న రథం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో గల పలువురు సహాయ సహకారాలతో జగన్నాథస్వామి రథం తయారీ శరవేగంగా జరుగుతుంది. స్థానిక జగన్నాథ స్వామి ఆలయంలో ప్రతి ఏటా జులైలో జగన్నాథ స్వామి రథయాత్రను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ రథాయాత్ర నిర్వహణకు ఎన్నో ఏళ్ల క్రితం తయారుచేసిన ప్రత్యేక రథంలో దేవతామూర్తుల విగ్రహాలను రథయాత్ర రోజున ఆలయం నుంచి రథంలో ఉంచి మేళా తాళాలతో, నృత్య గీతాలతో ఒరియా బ్రాహ్మణ భక్తులు ఊరేగింపుగా తీసుకొని గుడించా మండపానికి తీసుకుని వెళ్లేవారు. అయితే కరోనా సమయంలో రథయాత్రను ప్రభుత్వం నిర్వహించని కారణంగా రథం మరమ్మతులకు గురై శిథిలా వస్థకు చేరుకుంది. దీంతో రథాన్ని తయారు చేసేందుకు నిధుల్లేవని దేవాదాయ శాఖ చేతులు ఎత్తివేయడంతో గత రెండేళ్లగా రథయాత్ర రోజున దేవతామూర్తులు విగ్రహాలను తోపుడు బండిపై తీసుకువెళ్లే పరిస్థితి నెలకొంది. దీంతో అనేకమంది భక్తుల మనోభావాలు దెబ్బతిని అసహనానికి గురయ్యారు. అయితే ఈ ఏడాది కొందరు భక్తుల సహాయ సహకారాలతో జగన్నాథని రథం తయారీ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ రథం తయారీకి పట్టణానికి చెందిన వంశపారపర్య విశ్వ బ్రాహ్మణులైన చిట్టూరి, కడారి ఇంటి పేరు గల కుటుంబాలకు చెందిన వారు భాగస్వామ్యమై రథం తయారీ పనులను శరవేగంగా పూర్తి చేసేందుకు శ్రమిస్తున్నారు. దీంతో పట్టణ ప్రజలు ఈ ఏడాది రథయాత్ర చాలా ఘనంగా జరుగుతుందని ఆశాభావం హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రథయాత్రకు సిద్ధమవుతున్న రథం


మంగళగిరి టిడిపి కార్యాలయంలో విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నెల్లిమర్ల నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు.
- ప్రజాశక్తి, భోగాపురం

త్వరలో అన్ని సమస్యలూ పరిష్కారం : జనసేన

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ త్వరలో పరిష్కరిస్తామని జనసేన బిసి సెల్ కోఆర్డినేటర్ బోను పాపారావు యాదవ్ అన్నారు. మండలంలోని చప్పబుచ్చమ్మపేటలో ఆయన ఆదివారం పర్యటించారు. అక్కడి రైతులతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పంచాయతీలో అనేక సమస్యలు ఉన్నాయని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ సమస్యలు పరిష్కారం దిశగా మంత్రి సంధ్యారాణి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు పి.సుగుణేశ్వ రరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఎపిటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా బూరి తిరుమలరావు, పడాల రమేష్ ఎన్నికైనట్లు జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మర్రాపు మహేష్, నల్లా బాలకష్ణ రావు ఆదివారం తెలిపారు. ఎన్నికైన వీరు ఎంఇఒ-1 సామల సింహాచలాన్ని మర్యాదపూర్వకంగా కలిసి మండలంలోని వివిధ యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సహాయం కోరినట్లు తెలిపారు. అనంతరం ఎంఇఒ సింహాచలం మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తను శక్తి వంచన లేకుండా పని చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కన్వీనర్ డి.వేణుగోపాలరావు పాల్గొన్నారు. .

సీతంపేటలో వర్షం

సీతంపేట: మండలంలో ఆదివారం వర్షం కురిసింది. అప్పటి వరకు ఎండ భగభగ మండినప్పటికీ ఉదయం 9.30గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి కారు మబ్బులతో వర్షం కొద్దిసేపు కురిసింది. ఏజెన్సీలో గత వారం రోజులుగా వర్షాలు కురవడం లేదు సరి కదా ఎండలో తీవ్రంగా ఉండడంతో ఈ ఏడాది ఖరీఫ్ కష్టమవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం సంతలో వినియోగదారులకు ఆటంకం కలిగింది.

లంకజోడులో తాగునీటి ఎద్దడి

ప్రజాశక్తి - కురుపాం

తాగునీరు సక్రమంగా అందక ఆ గ్రామ గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుబాటులో ఉన్న నీటివనరులను వినియోగించుకోవడంలో అధికారులు సరైన చొరవ తీసుకోకపోవడంతో గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంది. ఫలితంగా నీటి కోసం ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

మండలంలోని వలసబల్లేరు పంచాయతీ లంకజోడులో తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో ప్రజలు తాగునీటి కోసం అష్ట కష్టాలు పడుతున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామ గిరిజనులు మాట్లాడుతూ జల జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామంలో ఇంటింటికీ కుళాయి మంజూరు చేశారు. కానీ పాత హెడ్ ఓవర్ ట్యాంకు బోరుకు కనెక్షన్ ఇవ్వడం వల్ల మోటర్ పోయి సుమారు నెల రోజుల నుంచి నీరు ఇంటింటికి అందడం లేదు. దీంతో గత్యంతరం లేక గ్రామంలోని 500 మంది జనాభా ఒక్క చేతి బోరుపైనే ఆధారపడ్డారు. గంటల తరబడి వేచి ఉండి నీరు తెచ్చుకొని ఆ నీటిని పొదుపుగా వాడుకుంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జలజీవన్ మిషన్ నూతన బోరు వేయించి ఇంటింటికీ కొళాయి నీరందేలా చూడాలని కోరుతున్నారు.


తాగునీటి కోసం ఒకేబోరుపై ఆధారపడుతున్న మహిళలు

తూర్పు కాపు సామాజిక వేదిక నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

స్థానిక తూర్పు కాపు సామాజిక భవనంలో జరిగిన సమావేశంలో తూర్పు కాపు సామాజిక వేదిక నూతన కమిటీ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షులుగా అంబల్ల అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఆర్లె కృష్ణారావు, కోశాధికారిగా పత్తిగుళ్ళ రామారావు, లీగల్ అడ్వైజర్లుగా వై.పరుశురాం, చందక చిన్ని ప్రభాకర్, జాయింట్ సెక్రటరీగా కోట్ల మూర్తి, కోరాడ సత్యం, గౌరవ అధ్యక్షులుగా కడగల ఆనంద్, పతివాడ అప్పలనారాయణ, గొర్లె వెంకటరమణ, మెంబర్స్‌గా మహంతి వెంకటరమణ, మీసాల నాగేశ్వరరావు, మంతిని రమేష్, తాడ్డి ప్రసాద్, కొట్యాడ శ్రీను, చెల్లూరి రమణ, పెదమజ్జి సత్యనారాయణ ఎన్నికయ్యారు. రొంగలి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్నికల అధికా రులుగా బోద రామకృష్ణ, పతివాడ సన్నిబాబు వ్యవహరించారు. మజ్జి అప్పారావుని రాష్ట్రస్థాయి కార్యవర్గానికి ఎంపిక చేస్తున్నట్లు ఈ సమావేశంలో నిర్ణయించారు.

సంతకవిటి: ఆంధ్రప్రదేశ్ తూర్పుకాపు సంక్షేమ సంఘం బలోపేతం కోసం జిల్లాలో అన్ని మండలాల్లో మండల కమిటీలు వేసేందుకు తీసుకొన్న నిర్ణయం మేరకు ఆదివారం రాజాం, సంతకవిటి, రేగిడి ఆముదాలవలస, వంగర మండలాల్లో తూర్పు కాపు సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారావు పర్యటించారు. ఆయన పాటు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డాక్టర్ మురళీమోహన్, జిల్లా నాయకులు శ్రీనివాసరావు, రమేష్ బాబు, మండల అధ్యక్షుడు అక్కరబో సత్యనారాయణ, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


నూతన కమిటీని అభినందిస్తున్న సభ్యులు


ప్రజాశక్తి
సోమవారం 24 జూన్ 2024

కుందర తిరువాడలో 'ఉపాధి' అక్రమాల పుట్ట

- అధికారుల కనుసన్నల్లో అవినీతి
- సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగు నాయుడు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలం లోని కుందరతిరువాడ పంచాయతీలో ఉపాధి పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనారిటీ అట్టడుగు వర్గాల ప్రజలు వలస బాట పట్టకుండా ఉండేందుకు 2005 జీవనోపాధి భద్రతకు కేంద్రంలో వామ పక్షాల పోరాటంతో తెచ్చిన ఉపాధి హామీ చట్టం నేడు అవినీతికి అడ్డాగా మారిందని విమర్శించారు. సంపన్నులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సైతం మస్తర్లలో పేర్లు రాసి ఉపాధి వేతనాలను తినేస్తున్న పరిస్థితి ఉందని గంగునాయుడు తెలిపారు. కుందర తిరువాడకు చెందిన అనేకమంది సుదూర ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధుల్లో ఉన్న వారి పేర్లు, అలాగే ఫీల్డ్ అసిస్టెంట్ బంధువుల పేర్లతో 2021 నుండి ఇంతవరకు పనులకు వెలుతున్నట్లు హాజరు వేసి పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి జాబ్ కార్డు 10286 కొండేటి ధనలక్ష్మి (భర్త వీరభద్ర కానిస్టేబుల్)



2023-24 రెండేళ్లలో49 రోజులుకు రూ.11900, కె.దీపిక జాబ్ కార్డు 10287 (జగదీశ్వరరావు ఎస్‌బిఐ మేనేజర్) 108 రోజులకు రూ.26,178, వై.స్వర్ణలత జాబ్‌కార్డు నెంబరు 10076 (హేమ సుందర్ కానిస్టేబుల్) 64 రోజులకు రూ.15,438, కె.అనూరాధ (10146, ఉల్లిభద్ర) 124 రోజులకు రూ.29,980, వీరితో పాటు ఎం.మంగమ్మ, గండి శంకర్రావు, యశోద, చిన్న బొండపల్లి దుర్గాప్రసాద్, పార్వతి, కంబర, బి.ధనలక్ష్మి, గణేష్ కుమార్, వైజాగ్ స్వర్ణలత, రమాదేవి ఇలా అనేకమంది వేర్వేరు గ్రామాల్లో ఉన్నవారి పేర్లతో లక్షల రూపాయలు అవినీతి జరిగిందని తెలిపారు. దీంతో పాటు గ్రామంలో ఉపాధి పనులకు వచ్చేవారికి వారానికి 200 రూపాయలు, పూర్తిగా పనికి రాని వారికి వారానికి 500 చొప్పున వసూళ్లు చేసినట్లు తెలిపారు. దీనిపై జిల్లా అధికారులు సమగ్ర దర్యాప్తు జరిపించాలని, బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని గంగునాయుడు డిమాండ్ చేశారు.



భద్రగిరి సిహెచ్‌సిలో ఒకే మంచంపై చికిత్స పొందుతున్న ముగ్గురు రోగులు

ఏజెన్సీలో పెరుగుతున్న రోగులు

కిటకిటలాడుతున్న ఆసుపత్రులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వర్షాకాలం వచ్చిందంటే చాలు గుమ్మలక్ష్మీపురం మన్యం వ్యాధులతో వణుకుతుంది. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ వైద్యం కోసం వస్తున్న రోగులతో ఆసుపత్రులు కిటకిట లాడుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోగులు వైద్యం కోసం నిరీక్షించాల్సి వస్తోంది. భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోజురోజుకు రోగుల తాకిడి పెరుగుతుంది. వైరల్, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతో బాధపడుతూ గిరిజనులు, విద్యార్థులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. పేరుకే సామాజిక ఆరోగ్య కేంద్రం మంచాలు చాలక ఒక్కొక్క మంచంపైన ఇద్దరు, ముగ్గురు రోగులు వైద్యం పొందుతున్న పరిస్థితి. మరోవైపు డ్రింకింగ్ వాటర్, మరుగుదొడ్లు అందుబాటులో లేవు. ఇక్కడ రోజుకు 200 పైగా ఒపి నమోదు కావడం విశేషం. వర్షాకాలం ప్రారంభంలోనే రోగుల సంఖ్య ఇలా ఉంటే రానున్న రోజుల్లో రోగుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు భావిస్తున్నారు. మరోవైపు తాడికొండ, రేగిడి, దుడ్డుఖల్లు పిహెచ్‌సిలు పరిధిలో ఉన్న గిరిజన గ్రామాల్లో మలేరియా ప్రభావం ఎక్కువగా ఉందని సర్పంచులు చెబుతున్నారు. గ్రామాల్లో ఉన్న సబ్ యూనిట్ కేంద్రాలకు వెళ్తున్న రోగులకు మలేరియా మందులు అందుబాటులో లేవని దీంతో చేసేది లేక గుమ్మ లక్ష్మీపురం వెళ్లాల్సి వస్తుందని చెబుతున్నారు.

గెస్ట్ టీచర్లకు అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏకలవ్య పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టడంతో అక్కడ పని చేస్తున్న గెస్ట్ టీచర్లపై ఆ ప్రభావం పడింది. ఖాళీ టీచర్లను మరో చోట ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అలాగే ఏకలవ్యకు వచ్చిన రెగ్యులర్ ఉపాధ్యాయులకు ఒక్కరుకు తెలుగు రాకపోవడంతో ఇటు విద్యార్థులు అటు అక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇలా అయితే విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యే అవకాశం ఉంటుంది. తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో బోధన ఉంటే బాగుంటుందని అభిప్రాయం పడుతున్నారు. దీనిపై వెంటనే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు స్పందించి విద్యార్థులకు చదువుకోవడం కోసం ఇబ్బందులు లేకుండా చూడాలని, ఎఫెక్ట్ అయిన ఉపాధ్యాయులకు నాన్‌టీచంగ్ సిబ్బంది ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు. మరోవైపు చదువుకోవడానికి సీట్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఏకలవ్యలో పాఠశాల సీట్లు, కళాశాల ఇంటర్మీడియట్ సీట్లు పెంచాలని కోరుతున్నారు.

నేటి నుంచి ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఈనెల 24 నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రతి సోమవారం ఉదయం 10 30గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. కావున జిల్లా ప్రజలు తమ సమస్యలపై వినతులను అందజేయవచ్చు

సీతంపేట: ఈనెల 24 నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు ఐటిడిఎ ఎపిఒ ఎస్.వెంకట్ గణేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులననుసరించి ప్రతి సోమవారం సీతంపేట, ఐటిడిఎ మీటింగ్ హాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. కావున సీతంపేట, ఐటిడిఎ పరిధిలో గల గిరిజన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలపై వినతులు సమర్పించుకోవచ్చని కోరారు.



సభలో మాట్లాడుతున్న రచయిత గంటేడ గౌరునాయుడు

శ్రీకాకుళం ఉద్యమ చరిత్రకు ఆనవాళ్లు 'భూషణం కథలు'

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

శ్రీకాకుళ ఉద్యమ కాలంనాటి సామాజిక స్థితిగతులను, ఉద్యమానంతర కాలంనాటి ప్రతిఫలనాలను భూషణం మాస్టారు తన కథల్లో అద్భుతంగా చిత్రీకరించారని ప్రముఖ కథా రచయిత మల్లీపురం జగదీశ్ అన్నారు. స్నేహకళాసాహితీ ఆధ్వర్యంలో స్థానిక వేదాంత కళాశాలలో ఆదివారం భూషణం మాస్టారి జయంతి సభ జరిగింది. ఈ సభలో భూషణం మాస్టారు రచించిన కొత్తగాలి కథను జగదీశ్ పరిచయం చేస్తూ ఉద్యమం తర్వాత అభివృద్ధి, ఆధునికతల మాటున ఛిద్రమైపోతున్న గిరిజనుల జీవన పరిస్థితులను ఈ కథ ద్వారా చక్కగా వివరించారని అన్నారు. భూషణం మాస్టారు రాసిన అడివంటుకుంది కథను పరిచయం చేసిన మరో కథా రచయిత చందనపల్లి గోపాలరావు మాట్లాడుతూ మైదాన ప్రాంతానికి చెందిన వర్తకులు అరువులు, చేబదుళ్ళిచ్చి వడ్డీల పేరుతో వారి ఆస్తులను ఎలా కొల్లగొట్టారో కళ్లకు కట్టినట్టుగా రచించారని అన్నారు. మంథా రఘునాథశర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో స్నేహకళాసాహితీ వ్యవస్థాపకులు గంటేడ గౌరునాయుడు, గడగమ్మ రామకృష్ణ, డాక్టరు వెంకటరావు, చదలవాడ సత్యనారాయణ, సిరికి స్వామినాయుడు, గంటేడ చిన్నంనాయుడు, గంటేడ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తగా ఎన్నికైన పంచాయతీ కార్యదర్శుల మండల నూతన కార్యవర్గం

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైనట్లు ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మరిశర్ల జగన్మోహన్ తెలిపారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఆయన అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షులుగా చింతాడ లక్ష్మి, కార్యదర్శి ఎం.ధనుంజయ, కోశాధికారి వి.భార్గవ, ఉపాధ్యక్షులు సూర్యప్రకాష్‌తో పాటు పదిమంది సభ్యులతో సంఘం ఏర్పాటైంది. ఎంపికైన వారికిఇఒపిఆర్‌డి ఎన్.కృష్ణుడు అభినందనలు తెలిపారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

పార్వతీపురంరూరల్ : పట్టణంలోని కెపిఎం హైస్కూలులో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న బి.సిహెచ్ ఆదినారాయణ వైజాగ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. గతకొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మృతికి పలువురు ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

ఎస్ఐకు సన్మానం

వీరఘట్టం : స్థానిక ఎస్సై జి.కళాధర్ పార్వతీపురం నుండి బదిలీపై ఇక్కడికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆదివారం స్థానిక పోలీస్ స్టేషనులో ఆయన్ను ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి జనసేన జానీ, మండల అధ్యక్షులు ఎం.పుండరీకం, కన్వీనర్ సరిపల్లి అచ్యుతరావు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కర్నేని సాయిపవన్, ఉదయాన చరణ్, నందివాడ పండు, చుక్క భార్గవ్, దత్తి గోపాల్, నాగరాజు, సందీపు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐను సన్మానిస్తున్న జనసేన నాయకులు

సాధన కమిటీలో ప్రజాసంఘాల నాయకులను కలపాలి

ప్రజాశక్తి - కొమరాడ

జంఝావతి ప్రాజెక్టు పూర్తి కోసం కూటమి నాయకులు ఏర్పాటు చేస్తున్న సాధన కమిటీలో ప్రజాసంఘాలు, ప్రతిపక్ష పార్టీల నాయకులను కలుపుకొని సమస్య సాధనకు కృషి చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి విజ్ఞప్తి చేశారు. ఆదివారం జంఝావతి ప్రాజెక్టును పరిశీలించి అనంతరం దంగభద్రలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 24 వేల ఎకరాలకు సాగునీరందించేలా ఆ రోజుల్లో రూ.12 కోట్లతో ప్రారంభించిన ఈ రిజర్వాయర్ నేటికీ 49ఏళ్లు గడుస్తున్నప్పటికీ పూర్తి కాలేదన్నారు. ఒడిశా ప్రభుత్వంతో కేవలం నాలుగు గ్రామాల్లోని 300 కుటుంబాలకు చెందిన 1117 ఎకరాల భూ వివాదం పరిష్కారం చేయలేక పాలకులు వదిలేసిన పరిస్థితి నెలకొందన్నారు. ఇలాంటి సందర్భంలో మూడు రోజుల క్రితం ఈ రిజర్వాయర్‌ను మండలంలోని కూటమి నాయకులు పరిశీలించిన అనంతరం రిజర్వాయర్ సాధన కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారని అన్నారు. సాధన కమిటీలో మూడు పార్టీల నాయకులు, నలుగురు ఎమ్మెల్యేలతో పాటు ప్రతిపక్ష, ప్రజా సంఘాల, రైతు సంఘం నాయకులను కలిపి సాధన కమిటీగా ముందుకు వెళ్తే మంచిదని అభిప్రాయపడ్డారు. ఈ సాధన కమిటీ ద్వారా ప్రతి సమస్యను అటు నీటిపారుదల శాఖ మంత్రికి, ఇటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తెలియజేస్తూ వీళ్లు ఇద్దరూ ద్వారా ఒడిశా ముఖ్యమంత్రిని కలిసి భవిష్యత్తులో జంఝావతి రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో సాధించుకొని 24 వేల ఎకరాలకు సాగునీరందించేలా సాధన కమిటీ ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. ఇదే స్ఫూర్తితో జంఝావతి రిజర్వాయర్‌ను ఒడిశాతో ఉన్న భూ వివాదాన్ని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రామారావు, డంగభద్ర వద్ద గ్రామానికి చెందిన రైతులు వాసుదేవరావు, రాజారావు, తిరుపతిరావు, వెంకట్రావు, శంకరరావు పాల్గొన్నారు.

వివాదంలో వైసిపి జిల్లా కార్యాలయం

రాష్ట్రవ్యాప్త ఫిర్యాదుల్లో భాగంగా జిల్లా అధికారుల చర్యలు


నిర్మాణం పూర్తయిన వైసిపి జిల్లా కార్యాలయం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పట్టణంలోని 16వ వార్డులో జల వనరుల శాఖకు చెందిన 1.18 ఎకరాల స్థలంలో రూ.2కోట్ల వ్యయంతో నిర్మాణం పూర్తికావచ్చిన వైసిపి కార్యాలయం భవనం వివాదాస్పదంగా మారింది. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అనుమతుల్లేకుండా రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో నిర్మిస్తున్న వైసిపి కార్యాలయ భవనాలపై అధికారులకు చేసిన ఫిర్యాదుల మేరకు పార్వతీపురంలో నిర్మిస్తున్న ఈ భవనం గురించి చర్చ జరుగుతోంది. మున్సిపల్ ప్రణాళిక విభాగం అధికారుల నుంచి ఎలాంటి అనుమతులూ, ప్లాను లేకుండానే నిర్మిస్తున్నట్లు తెలిసింది. జల వనరులశాఖకు చెందిన ఇదే స్థలంలో గతంలో రైతు శిక్షణ కేంద్రం కోసం ప్రభుత్వం నిర్మించబోయే భవనానికి శంకుస్థాపన కూడా జరిగింది. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన ఈ స్థలంలో వైసిపి నాయకులు అప్పటి అధికారుల ప్రోత్సాహంతో అత్యంత ఖరీదైన ఈ భవనం నిర్మాణం పట్ల స్థానికులు అప్పట్లోనే వ్యతిరేకించారు. అయినప్పటికీ అధికారులు ఎవరూ చొరవ చూపకపోవడంతో భవన నిర్మాణం చక చక జరిగిపోయి ప్రారంభానికి సిద్ధంగా మారింది. భవనం నిర్మిస్తున్న స్థలం వైసిపి జిల్లా శాఖకు కేటాయిస్తున్నట్లు ఎటువంటి పత్రాలు లేకపోగా, భవన నిర్మాణం కోసం కూడా ఎటువంటి అనుమతులూ లేవు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలకు సంబంధించిన భవనాలు నిర్మించడానికి కేటాయించిన ఈ స్థలంలో తమ అధికార దర్పంతో కబ్జా చేసి భవన నిర్మాణాన్ని తలపెట్టారని స్థానిక టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ భవన నిర్మాణంపై సంబంధిత అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

క్రీడలు పట్ల యువత, విద్యార్థులు ఆసక్తి చూపాలని స్పోర్ట్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు రావు శ్రీనివాసరావు కోరారు. స్థానిక వీరబొబ్బిలి క్రీడా మైదానంలో ఆదివారం అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడలు పట్ల ఆసక్తి చూపాలని విద్యార్థులు, యువతను కోరారు. ఆర్మీ, నేవీ, పోలీస్, ఎయిర్ ఫోర్స్ ఉద్యోగాలు కోసం యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.